సాక్షి కామారెడ్డి

బుధవారం । 11 । జూన్ । 2025



బీభత్సం సృష్టించిన గాలులు

జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం రాత్రి వీచిన బలమైన గాలులు బీభత్సం సృష్టించాయి.

- 8లో ▶



పనులను వేగవంతం చేయాలి

ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణ పనులలో వేగం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.

- 8లో ▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8 /20.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ప్రభుత్వం అండగా ఉంటుంది'

కామారెడ్డి క్రైం: కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన వారి బాగోగులు తెలుసుకునేందుకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బాధిత పిల్లలు, వారి సంరక్షకులు పాల్గొన్నారు. బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ స్వర్ణలత, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక



కామారెడ్డి అర్బన్: తమ పాఠశాల విద్యార్థి వెంకట్ రాష్ట్రస్థాయి అండర్–11 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడని జిల్లాకేంద్రంలోని అక్షర హైస్కూల్ ప్రిన్సిపల్ సంగీతారెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ లోకేష్‌రెడ్డి, కోచ్ సందీప్‌గౌడ్ అభినందించారన్నారు.

'మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు'



కామారెడ్డి అర్బన్ : మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాదక ద్రవ్యాల నియంత్రణ కన్వీనర్లు విశ్వప్రసాద్, ఆకుల సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు క్విజ్‌తోపాటు చర్చాగోష్టి నిర్వహించారు. మాదక ద్రవ్యాలతో మానసికంగానే కాకుండా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా, సామాజికంగా పతనం అవుతారని ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, కవిత, తబస్‌బేగం, అనిల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలమైన గాలులకు ఇద్దరి బలి



ప్రభు (ఫైల్)

బాన్సువాడ: బలమైన గాలులు ఇద్దరి ప్రాణాలను బలిగొన్నాయి. బాన్సువాడలో గాలి ప్రభావానికి దాబాపైనుంచి పడి ఒకరు మరణించగా.. నిజామాబాద్‌లో రేకులు విరిగి మీదపడడంతో మరొకరు మృత్యువాతపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ బల్దియా పరిధిలోని తాడ్కోల్ శివారులోగల డబుల్ బెడ్ రూం కాలనీలో ప్రభు (55) నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి అతడు దాబాపై పడుకున్నాడు. గాలులు వీయడంతో నిద్రలోంచి మేల్కొని, నిల్చున్నాడు. గాలులు బలంగా వీయడంతో అదుపుతప్పి కిందపడి మరణించాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

నిజామాబాద్‌లో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సంజీవరెడ్డి కాలనీకి చెందిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆస్పాడ్ శ్రీనివాస్(55) సోమవారం రాత్రి వర్షం రావడంతో వినాయక్‌నగర్‌లోని కల్లు బట్టీలోకి వెళ్లాడు. ఆ సమయంలో చెట్టుకూలి కల్లుబట్టీపై పడడంతో, రేకులు విరిగి శ్రీనివాస్‌పై పడ్డాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు. కేసు నమోదు చేసుకున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఒకప్పుడు అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించే నాయకత్వం ఉండేది. అన్ని నియోజక వర్గాల నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేవారు. ఇదంతా గతం.. ఇప్పుడు ఏ పార్టీలో చూసినా జిల్లాను లీడ్ చేసే నాయకులు కనిపించడం లేదు. ప్రధాన నేతలందరూ తమ అసెంబ్లీ నియోజకవర్గాలకే పరిమితం అవుతున్నారు. దీంతో జిల్లాలో ఆయా పార్టీల్లో నాయకత్వ సమస్య కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

నడిపించే నాయకులేరి?



- అన్ని పార్టీలను వేధిస్తున్న సమస్య
- అధికార పార్టీలో నేతల మధ్య సమన్వయం కరువు
- బీఆర్‌ఎస్, బీజేపీలదీ అదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కైలాస్ శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ముజీబుద్దీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్న రాజులు ఉన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పార్టీ కార్యక్రమాలు ఉన్నపుడు అటెండ్ అవుతారు తప్ప అందరినీ సమన్వయం చేసే పరిస్థితి లేదు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కొంత యాక్టివ్‌గానే ఉన్నా, మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లో పనిచేశారు. ఈ మధ్య కాలంలో ఆయన కూడా రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం లేదు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నా అందరినీ సమన్వయం చేయడంలో చురుకైన పాత్ర పోషించలేకపోతున్నారన్న అభిప్రాయంవ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లో ఎక్కడి వారక్కడే..

కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఒకప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలకంగా పనిచేశారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో షబ్బీర్‌అలీ అన్నీ తానై జిల్లాను నడిపించారు. అయితే మొన్నటి ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కామారెడ్డితో పాటు నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గాలకు సంబంధించిన వ్యవహారాలను చూస్తున్నారు. బాన్సువాడకు చెందిన సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొన్నటి ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచి, తరువాత కాంగ్రెస్‌లో చేరారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి జిల్లాకు నాయకత్వం వహించారు. తరువాత 2014 లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉమ్మడి జిల్లాను లీడ్ చేశారు. 2018లో రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్నారు. ఈసారి పార్టీ మారిన తర్వాత తన నియోజక వర్గానికే పరిమితమయ్యారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తన నియోజక వర్గంలో అన్నీ తానే చూసుకుంటారు. తన నియోజకవర్గంలో మరొకరి పెత్తనం ఉండకూడదనే భావనతో ఉన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కూడా తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సాగు నీరందించేందుకు ఉద్దేశించిన కాళేశ్వరం 22వ ప్యాకేజీకి ఇటీవల రూ. 23 కోట్లు మంజూరయ్యాయి. అయితే రెండు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు నిధులు తాను తెచ్చానంటే తానే తెచ్చానని చెప్పుకున్నారు. పనులు పూర్తి చేయడానికి నేతలు సమన్వయం చేసుకుని అవసరమైన నిధులు తీసుకువచ్చే పరిస్థితి కనబడడం లేదు.

బీజేపీలోనూ అంతే..

అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి గెలుపొందడం, మిగతా మూడు నియోజక వర్గాల్లో మంచి ఓట్లు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. అయితే పార్టీ జిల్లా శాఖను లీడ్ చేసే నాయకత్వం కనిపించడం లేదు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఎల్లారెడ్డిలో పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి పార్టీ వ్యవహారాలను చూస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఎంపీ టికెట్టు ఆశించిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి ఈ మధ్య కాలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే అరుణతార పార్టీ కార్యక్రమాలను నడిపిస్తున్నారు. అయితే అంతా ఎవరి నియోజకవర్గానికి వారు పరిమితమవడం, వీరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగే నేత లేకపోవడంతో పార్టీ శ్రేణులలో జోష్ కనిపించడం లేదు.

బీఆర్‌ఎస్‌దీ అదే పరిస్థితి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లాపై పదేళ్ల పాటు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో ఓటమి తరువాత నాయకత్వ సమస్యలు ఎదుర్కొంటోంది. తొలిసారి అధికారంలోకి వచ్చినపుడు అప్పటి మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఐదేళ్ల పాటు నేతలను సమన్వయం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన నియోజక వర్గంపైనే ఎక్కువగా ఫోకస్ చేశారు. ఉమ్మడి జిల్లాలో మంత్రిగా వేముల ప్రశాంత్‌రెడ్డి లీడ్ చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను ఆయన సమన్వయం చేసుకున్నారు. అయితే ఇప్పుడు అధికారం కోల్పోయిన తరువాత పార్టీ నాయకత్వాన్ని సమన్వయం చేసే లీడర్ లేకుండాపోయారు. కామారెడ్డిలో మాజీ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే సురేందర్, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధేలు తమ తమ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను చూసుకుంటున్నారు. బాన్సువాడలో నాయకత్వ సమస్య ఉంది.

సమస్యల ఒడిలో సర్కారు బడి



జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

- చాలాచోట్ల మౌలిక వసతులు కరువు
- ప్రహరీలు లేక ఇబ్బందులు
- టాయిలెట్లు లేక అవస్థలు
- రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కామారెడ్డి టౌన్ : వేసవి సెలవులు ముగింపునకు వచ్చాయి. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్నాయి. బడులను తిరిగి తెరిచేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. అలాగే తక్కువ ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కసరత్తు నడుస్తోంది. అయితే షరామామూలుగా ఈసారీ విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. చాలాచోట్ల మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

పెండింగ్‌లో రూ. 9.96 కోట్ల బిల్లులు..

పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టింది. జిల్లాలో మొత్తం 1,040 ప్రభుత్వ పాఠశాలలుండగా 973 పాఠశాలల్లో గతేడాది మార్చిలో వివిధ పనులు ప్రారంభించారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలకు అవసరమైన మరమతులు, తరగతి గదుల్లో మైనర్, మేజర్ మరమ్మతులు, తదితర పనుల బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. ఎంపిక చేసిన స్కూళ్లకు రూ. 22 కోట్ల పనులకు పరిపాలన పరమైన అనుమతులు లభించాయి. చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు 98 శాతం పూర్తయ్యాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ పనులు చేసినవారికి ఇంకా రూ. 9.96 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



జిల్లా కేంద్రంలో కూలిపోయిన బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ

ఎక్కడి సమస్యలక్కడే..

జిల్లాలో చాలా స్కూళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు స్కూళ్ల ఆవరణలు కుంటలుగా మారుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తాగునీటి సమస్యలున్నాయి. పలు స్కూళ్లకు ప్రహరీలు లేవు. వేసవి సెలవుల్లో బడులకు భద్రత కరువవడంతో కొన్నిచోట్ల ఆకతాయిలు నల్లాలను ధ్వంసం చేశారు. సరైన వంటశాలలు కూడా లేవు. వేసవి సెలవుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటే బాగుండేదన్న అభిప్రాయం పిల్లల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాగానే చెల్లిస్తాం. బడుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం.

– రాజు, డీఈవో, కామారెడ్డి

జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- ఫ్లోర్‌మిల్‌లో రూ. 28 లక్షల విలువైన శనగపప్పు సీజ్
- పలు హోటళ్లలో కుళ్లిన మాంసం గుర్తింపు, ధ్వంసం
- యజమానులకు నోటీసులు జారీ

కామారెడ్డి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాలలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో దాడులు సాగాయి. ముందుగా సదాశివనగర్ మండలంలోని పోసానిపేటలో గల ఫ్లోర్ మిల్‌లో తనిఖీ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో శనగ, రాగి, జొన్నపిండి ప్రాసెస్ చేస్తున్నట్లు గుర్తించారు. కిటికీలకు మెష్ లేకపోవడం, మిల్‌లో బూజుతో కూడిన దుమ్ము ధూళి ఉండడం, రికార్డులు సరిగా లేకపోవడాన్ని గమనించారు. సుమారు రూ. 28.50 లక్షల విలువగల 42,500 కిలోల లేబుల్, ప్యాకింగ్ వివరాలు లేని అనుమానాస్పదంగా ఉన్న శనగపప్పును సీజ్ చేశారు. శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామని జ్యోతిర్మయి తెలిపారు. యజమానికి నోటీసులు ఇచ్చామన్నారు.

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గల పర్ణిక ప్యాలెస్, డిగ్రీ కళాశాల మైదానం ముందున్న వైష్ణవి ఇంటర్నేషనల్ హోటల్‌లలోనూ తనిఖీలు చేశారు. రొయ్యలు, చేపలు, చికెన్, కుళ్లిన మాంసంతో పాటు, వెజ్, నాన్‌వేజ్ ఐటమ్‌లను ఒకే రిఫ్రిజిరేటర్‌లో కలిపి ఉంచడం, అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు వేడి చేసిన వంట నూనెలను ఆహార పదార్థాలలో వాడుతున్నట్లు గుర్తించారు. పర్ణిక ప్యాలెస్ హోటల్ స్టోర్ రూమ్‌లో రూ. 45 వేల విలువగల నిల్వ ఉంచిన మాంసం, కాలం చెల్లిన ముడి సరుకులు, తేనె, ఫ్రూట్స్, పురుగు పట్టిన బియ్యం, మిల్ మేకర్, ధనియా పొడి తదితర పదార్థాలను ధ్వంసం చేశారు.

వైష్ణవి ఇంటర్నేషనల్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సుమారు రూ.17 వేల విలువచేసే 40 కిలోల నిల్వ ఉంచిన దుర్వాసన వస్తున్న మాంసం, 10 కిలోల గోధుమ పిండి, 10 కిలోల కుళ్లిన రొయ్యలను గుర్తించి, ధ్వంసం చేశారు. వాటి యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చారు. కొత్త బస్టాండ్ ముందున్న 3 హోటళ్లపైనా దాడులు చేసి నోటీసులు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, శ్రీశిక, పి.స్వాతి, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



పోసానిపేట్‌లో ఫ్లోర్‌మిల్ యజమానికి నోటీసు ఇస్తున్న అధికారి జ్యోతిర్మయి

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

దోమకొండ : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం సంఘమేశ్వర్‌లో నిర్వహించిన భూభారతి సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల దరఖాస్తులకు సంబంధించిన భూ వివరాలను రెవెన్యూ రికార్డులలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులన్నింటిని కచ్చితంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచాలని, ఆలస్యం చేయకుండా అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి అన్ని రకాల భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ సుధాకర్‌తో పాటు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇంకా ప్రారంభించని వారితో మాట్లాడి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా, లబ్ధిదారులు ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఆర్డీవో వీణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలను సిద్ధం చేయాలి

విద్యాసంస్థల పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల, వసతి గృహం, భోజనశాల, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. గురువారంనుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నందున వెంటనే ఆవరణతోపాటు గదులను శుభ్రం చేయించాలని, వాటర్ ట్యాంకులను కడిగించాలని ఆదేశించారు. భోజనానికి ఉపయోగించే సరుకులను నాణ్యమైనవే వాడాలని కళాశాల ప్రిన్సిపాల్ చైతన్యకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల జోనల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సంఘమేశ్వర్‌లో రైతు దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

ప్రతి ఇంటికి శుద్ధమైన నీరు..

కామారెడ్డి క్రైం : ప్రతి ఇంటికి శుద్ధమైన నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ ఉన్నతాధికారులు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హర్ ఘర్ జల్ కార్యక్రమం కింద జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో ఉన్న జిల్లాలోని 953 ప్రభుత్వ పాఠశాలలతో పాటు 1,095 అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లాలోని 423 రెవెన్యూ గ్రామాలలో శుద్ధమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. అన్ని వివరాలను జల్ జీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో కలపొద్దు

- గోపన్‌పల్లివాసుల డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ముట్టడి

బిచ్కుంద : 'మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసి మా పొట్టగొట్టొద్దు' అంటూ గోపన్‌పల్లి వాసులు ఆందోళనకు దిగారు. మంగళవారం బిచ్కుంద మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అభిప్రాయ సేకరణ జరిపినప్పుడు అందరూ పంచాయతీగానే కొనసాగించాలని చెప్పారన్నారు. తమ అభిప్రాయాలను పక్కనబెట్టి మున్సిపాలిటీలో విలీనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూలి పనులు చేసుకుని జీవించే తమకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేయవద్దని కోరారు. అధికారులు స్పందించి తమ గ్రామాన్ని పంచాయతీగానే కొనసాగించాలన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గోపన్‌పల్లి ప్రజలు

వాటర్ ట్యాంక్ ఎక్కిన కాంగ్రెస్ నాయకులు

- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని..
- సముదాయించిన నాయకులు, పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బోధన్ పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు బీటీ నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. సీనియర్ నాయకుడు, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సుదర్శన్‌రెడ్డికి అధిష్టానం మంత్రి పదవి ఇవ్వక పోవడం సరికాదని, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అధిష్టానంతో మాట్లాడి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోతే తాము ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్‌కుమార్‌తోపాటు మరో ముగ్గురు నాయకులు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు బీటీనగర్ కాలనీకి చేరుకుని పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్‌తో మాట్లాడారు. వాటర్ ట్యాంక్ ఎక్కిన వారిని కిందికి దిగాలని పోలీసులు కోరారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో కలగజేసుకున్న నాయకులు.. తాము పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడామని చెప్పడంతో వారు ట్యాంక్‌పై నుంచి కిందికి దిగి వచ్చారు.



వాటర్ ట్యాంక్‌పై యువజన కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం పనులలో వేగం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పంచాయతీరాజ్ ఇంజినీర్ ను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మేస్త్రీలను, ఇతర కార్మికులను అధికంగా నియమించుకొని పనుల్లో వేగం పెంచి నవంబర్‌లోగా పూర్తిస్థాయిలో నిర్మాణం పనులు జరిపించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డీఈ స్వామి దాస్, ఏఈ సంజయ్‌ని ఆదేశించారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌కు రక్షణ చర్యలు కల్పించాలని సెక్యూరిటీ సిబ్బందిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మూడు నెలల సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం కలెక్టర్ ఈవీఎం గోడౌన్‌ను సందర్శించారు. గోడౌన్‌లో సెక్యూరిటీ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, కామారెడ్డి ఆర్డీవో వీణ, ఎలక్షన్ డీటీ అనిల్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకు ఏర్పాటు కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కిరణ్మయి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు మంగళవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్మయి మాల్తుమ్మెద శివారులో స్థలాన్ని పరిశీలించారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకు ఏర్పాటు కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలమేరకు నాగిరెడ్డిపేట రెవెన్యూ అధికారులు మండలంలోని మాల్తుమ్మెద శివారులో గల సర్వే నం,834లో 10గుంటల భూమిని ఎంపిక చేశారు. ఈ మేరకు పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్మయి పరిశీలించారు. మాల్తుమ్మెద శివారులో ఎంపిక చేసిన స్థలం వివరాలను అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. గతంలో డెయిరీ శిక్షణ కోసం 10ఎకరాల స్థలాన్ని ఐకేపీకి కేటాయిచారని అధికారులు ఆమెకు వివరించారు. ప్రస్తుతం అందులో నుంచి పెట్రోల్‌బంకు ఏర్పాటు కోసం స్థలాన్ని ఎంపిక చేశామని వారు తెలిపారు. ఆమెవెంట నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ మహ్మద్, సీసీ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల జిల్లా కమిటీ నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న గంగాధర్

బాన్సువాడ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుల జిల్లా కమిటీని మంగళవారం బాన్సువాడలో ఏకగ్రీవంగా నియమించారు. మలిదశ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆదేశానుసారంతో జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ సమక్షంలో నూతన కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా కడెం బాబాగౌడ్, ఉమ్మడి బీర్కూర్ మండలం అధ్యక్షులుగా ఆరేళ్ల పవన్‌గౌడ్‌లను నియమించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యల కోసం పోరాటం చేస్తామని గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు గంజి



కంభాపూర్ గ్రామ శివారులో రోడ్డుపై పడ్డ చెట్టు



హాజీపూర్‌లో ఎల్లారెడ్డి- కామారెడ్డి ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్లు

బీభత్సం సృష్టించిన ఈదురుగాలులు



తాడ్వాయిలోని బీసీ కాలనీలో ..



బాన్సువాడలో రోడ్లపై చెట్లను తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు



మద్నూర్‌లో ఇంటిముందు నిలిచిన వర్షపు నీరు

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

సాక్షి నెట్‌వర్క్:బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో సోమవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చెట్లు విరిగి రోడ్లపై అడ్డంగా పడ్డాయి. దీంతో చాలా చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. విద్యుత్ తీగలు తెగిపోవడంతో కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం నుంచే విద్యుత్ సిబ్బంది విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



సంగం గ్రామంలో విరిగి పడిన విద్యుత్తు స్తంభం



లింగంపల్లిలో రేకులషెడ్డుపై పడ్డ స్తంభం



కొత్తాబాదిలో ..

నీటితో నిండిన పల్లె ప్రకృతి వనం



దోంగ్లీ పల్లెప్రకృతి వనంలో నిలిచిన వరద నీరు

దోంగ్లీ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి పక్కనే గల పల్లె ప్రకృతి వనం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నీటితో నిండింది. ప్రకృతి వనాన్ని కొద్దిగా దిగువ ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో నీళ్లు చేరాయి. పల్లెప్రకృతి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - మద్నూర్(జుక్కల్)

క్రైం కార్నర్

వడ్డీ వ్యాపారుల వేధింపులతో యువకుడి ఆత్మహత్యాయత్నం

బిచ్కుంద(జుక్కల్): వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక మండలంలోని మాన్యాపూర్ గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి భార్య తెలిపిన వివరాలు ఇలా.. మాన్యాపూర్‌కి చెందిన ముప్పిడి జ్ఞానేశ్వర్ రెండేళ్ల క్రితం వడ్డీ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగారాం వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. ప్రస్తుతం రెండేళ్ల వడ్డీతో కలిపి రూ.4.2 లక్షలు అయ్యింది. వడ్డీ చెల్లించాలని గంగారాం అతడి భార్య పరిపూర్ణ ఇద్దరు కలిసి జ్ఞానేశ్వర్‌ను వేధించారు. దీంతో ఆరు నెలల క్రితం జ్ఞానేశ్వర్ రూ.2లక్షల 20వేలు వడ్డీ కట్టాడు. అసలు సొమ్ము రూ.రెండు లక్షలను పొలం అమ్మి ఇస్తానని చెప్పాడు. ఈ క్రమంలో సోమవారం గంగారాం తన భార్యతో కలిసి జ్ఞానేశ్వర్ ఇంటికి వచ్చి, డబ్బులు ఇవ్వకుంటే అంతుచూస్తామని బెదిరించారు.

దీంతో గ్రామంలో పరువు పోయిందని జ్ఞానేశ్వర్ మనస్తాపం చెంది గంగారాం ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గంగారాం స్వయంగా తన కారులో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై బాధితుడి భార్య ఉపాధ్యాయుడు గంగారాం, అతడి భార్య పరిపూర్ణపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కెనాల్‌కట్టపై నివాసం ఉంటున్న షేక్‌పాషా(56) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. షేక్‌పాషా గత కొన్ని రోజులు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు ధ్వంసం చేసి సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నగరంలో వ్యక్తి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రా శివారులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్య నగర్‌కు చెందిన దోస వసంత్‌కుమార్ (38) బజాజ్ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రివేళ వసంత్ కుమార్ పాంగ్రా శివారులో హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. దుండగులు మృతుడి తలపై రాయితో దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంకా ఇతర పదునైనా ఆయుధాలతో దాడి చేశారా అనే అనుమానం వ్యక్తం చేశారు.రాత్రి కల్లుబట్టిలో కల్లు తాగిన తర్వాత దుండగులు హత్య చేశారా? లేదా ఇతర కారణాలతో హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. క్లూస్‌టీంతో ఆధారాలను సేకరిస్తున్నారు. దీంతోపాటు చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు



సంచరిస్తున్న కుక్కలు

బాన్సువాడ: బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఒంటరిగా వెళ్తున్న రాచకొండ భూమవ్వ, మేకల బేతయ్య, మేకల సాయిలు, బీహారి కూలీపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా కరిచాయి. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. నిజామాబాద్ ఆస్పత్రిలో ప్రస్తుతం వీరందరు చికిత్స పొందుతున్నారు.

ఆర్మూర్‌లో బధిరుల పాఠశాల

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో 12 ఎకరాల సువిశాల స్థలంలో 1983 సెప్టెంబర్‌లో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా, మెదక్ డయాసిస్ ఆధ్వర్యంలో తెలంగాణలోనే ఏకైక బధిరుల పాఠశాల ప్రారంభమైంది.

- ఐదుగురు విద్యార్థులతో ప్రారంభించిన పాఠశాల నేడు ఎంతో మందికి సేవలందిస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో (దివ్యాంగుల్లో) ఆత్మ విశ్వాసాన్ని నింపుతోంది.
- ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులతోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన సుమారు 110 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 15 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు.
- పాఠశాల ప్రారంభం నుంచి సుమారు 500 మందికి పైగా చెవిటి, మూగ విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసుకొని ఆయా ప్రాంతాలలో వివిధ వృత్తులలో జీవనం కొనసాగిస్తున్నారు.
- విద్యార్థులందరికీ సీఎస్ఐ గతంలో ఉచితంగా విద్యా, వసతిని కల్పించేది.
- ప్రస్తుతం నామమాత్రపు ఫీజులతో సంస్థను కొనసాగిస్తున్నారు.
- విద్యార్థులకు సామూహిక, వ్యక్తిగత వినికిడి యంత్రాల సహాయంతో పాఠ్యాంశాలను బోధిస్తూ ఆడిటరీ ట్రెయినింగ్, స్పీచ్ థెరపీని అందిస్తున్నారు.
- వృత్తి విద్య, సాంస్కృతిక, క్రీడా, విద్యా అంశాలలో బధిర విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. – ఆర్మూర్

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్/భిక్కనూరు/దోమకొండ/కామారెడ్డి రూరల్ : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో తెలంగాణ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి నియామకంపై మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్స్ పంచుకున్నారు. భారీ కేక్‌కు కట్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివకృష్ణమూర్తి, పంపరి శ్రీనివాస్, చాట్ల వంశీకృష్ణ, సలీమ్, సాయిబాబ, మహేష్, రాంమోహన్, జూలూరి సుధాకర్, సుగుణ, గ్యార సాయిలు తదితరులున్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను జనరల్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డికి చెందిన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి నియామకమైన సందర్భంగా దేవునిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కమ్యూనిటీ అధ్యక్షుడు గడ్డం రవీందర్, జనరల్ సెక్రటరీ కే బాలాజీ, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవునిపల్లి డబుల్ బెడ్ రూమ్ కమ్యూనిటీ సభ్యులు అశోక్, రవి, శీను తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో ప్రజలకు సేవచేస్తే తగిన గుర్తింపు : ఇంద్రకరణ్‌రెడ్డి



ఇంద్రకరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నేతలు

కాంగ్రెస్ పార్టీలో ప్రజలకు సేవ చేస్తేనే తగిన గుర్తింపు వస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించినందున ఆయనను కాంగ్రెస్ నేతలు ఆయన స్వగ్రామమైన రామేశ్వర్‌పల్లిలో ఘనంగా సన్మానించారు. షబ్బీర్‌అలీకి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నేతలు సుధాకర్‌రెడ్డి, తక్కళ్ల బాపురెడ్డి, శ్రీరాం వెంకటేశ్, నర్సింలు యాదవ్, సాజీద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డిని దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. గతంలో పీసీసీ కార్యదర్శిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రధాన కార్యదర్శిగా నియమించిందని వారు తెలిపారు.

సమాచారం..

ట్రాన్స్‌కో అధికారులకు కొత్త నంబర్లు

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండల ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది, లైన్‌మెన్ తదితర వారి ఫోన్ నెంబర్లు మారినట్లు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ గోపికృష్ణ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి నూతన ఫోన్ నెంబర్లను ఉన్నతాధికారులు కేటాయించడంతో వారికి సిమ్‌కార్డులు అందించామని ఏఈ తెలిపారు.

గోపికృష్ణ, ఏఈ, మద్నూర్ మండలం	8712482039
సబ్ ఇంజనీర్, మద్నూర్ మండలం	8712482044
సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్(ఎల్ఐ), మద్నూర్ మండలం	8712482041
లైన్ ఇన్‌స్పెక్టర్, మద్నూర్ టౌన్	8712482046
లైన్‌మన్ మద్నూర్ టౌన్	8712482042
లైన్‌మన్, హండేకేలూర్	8712482038
లైన్‌మన్, ఎక్లార	8712482036
సబ్ స్టేషన్, మద్నూర్	8712482040
సబ్ స్టేషన్, సోమూర్	8712482043

లింగారెడ్డిపేటలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



చెక్ అందిస్తున్న కమిషనర్ మహేశ్ కుమార్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో గల లింగారెడ్డిపేట గ్రామంలో మంగళవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ తెలిపారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లింగారెడ్డిపేట గ్రామంలో ప్రత్యేకంగా డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి మొత్తం మురికి కాలువలను శుభ్రం చేయించమన్నారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

మహిళలకు రూ.కోటి 58 లక్షల రుణాలు..

ఎల్లారెడ్డి పట్టణంలోని పలు డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.కోటి 58 లక్షల 50 వేల రుణాలను అందించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న రుణాలతో అభివృద్ధి చెందాలని సూచించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త రిమాండ్

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్‌కు చెందిన గుంజె అక్షయ నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో అక్షయ మృతికి భర్త సునీల్ వేధింపులే కారణమని మృతురాలి తండ్రి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం సునీల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎండీ మాలిక్ రెహమాన్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వివిధ ఘటనల్లో పలువురు మృతి చెందారు. నందిపేట, బాన్సువాడ మండలాల పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. అలాగే వేల్పూర్ మండలంలో చెరువులో పడి ఒకరు, నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు..



నందు (ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. చించోల్లి గ్రామానికి చెందిన ఇల్తాం గంగారం (40) ట్రాక్టర్‌లోకి డీజిల్ కోసం మంగళవారం రాత్రి బైక్‌పై బీర్కూర్ వెళ్లాడు. అదే రాత్రి డీజిల్ తీసుకుని బైక్‌పై చించోల్లికి బయలుదేరాడు. అలాగే అన్నారం గ్రామానికి చెందిన సంగెం నందు(18) అనే యువకుడు మార్కెట్ కోసం బీర్కూర్‌కు బైక్‌పై బయలుదేరాడు. బీర్కూర్ మండలం కిష్టాపూర్ శివారులో వీరిద్దరి బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో గంగారం, నందుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బాన్సువాడ ఎస్సై రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాలను బాన్సువాడ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో పక్కపక్క గ్రామాలకు చెందిన ఇద్దరు మృతి చెందడంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యుల రోదనలు అందరిని కంటతడి పెట్టించాయి.

నందిపేటలో..



రంజిత్ (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన ఇమ్మల రంజిత్(21) అలియాస్ దేవళ్ల సిద్దు అనే యువకుడు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రంజిత్ నందిపేట మండలం సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడిని వెంటబెట్టుకుని బైక్‌పై మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి నందిపేటకు బయలుదేరాడు. హైదరాబాద్ శివారులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన పిల్లర్‌ను వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రంజిత్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన మరో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.

వేల్పూర్ మండలంలో..



రాజయ్య(ఫైల్)

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలోగల కొత్త చెరువులో ఓ పశువుల కాపరి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పశువుల కాపరి సెవ్వ రాజయ్య(52) చాలాకాలంగా స్థానిక గురడికాపు వర్గానికి చెందిన పశువులను మేపేవాడు. సోమవారం పశువులను మేపడానికి తీసుకెళ్లగా, చెరువులోకి వెళ్లిన పశువులను తీసుకురావడానికి నీటిలోకి దిగాడు. పశువులను బయటకు తెచ్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. మంగళవారం అతడి మృతదేహం తేలడంతో పోలీసులు బయటకు తీసి,, పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి...



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఒక గుర్తుతెలియని వ్యక్తి గుంతకల్లు నుంచి బోధన్ (రైలు నెంబర్ 57411) వెళ్ల రైలులో ప్రయాణిస్తుండగా, అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ దుర్గ ప్రసాద్ ఇచ్చిన సమాచారం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతుడి వయస్సు సుమారు 50–55ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే రైల్వే ఎస్సై 87126 58591 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ప్రభుత్వ పీఈటీ..



దివాకర్ (ఫైల్)

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన గోడ దివాకర్(45)అనే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు నిజామాబాద్‌లోని కంఠేశ్వర్‌లో నివాసం ఉంటూ మోస్రా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. మే 30న స్కూటీపై తన స్వగ్రామం బ్రాహ్మణపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మాక్లూర్ మండలం దాస్‌నగర్ శివారులో 63వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి భార్య నిరోషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.